ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 97 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 19 జులై 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# కేసీఆర్ శాపగ్రస్తుడు

రాసిపెట్టుకో.. మరో పదేళ్లు మాదే అధికారం
పాలమూరు ప్రాజెక్టులను పూర్తిచేసి చూపిస్తా
రాయలసీమ లిఫ్ట్‌ను చంద్రబాబు రద్దు చేసుకోవాల్సిందే
పాలమూరును పచ్చగా చేసి చూపించే బాధ్యత తీసుకున్నా
ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం
మహిళలను కోటీశ్వరులను చేసే పనిలో ఉన్నాం
ఎస్సీ వర్గీకరణను అమలు చేసి చూపాం
కొల్హాపూర్ పర్యటనలో సిఎం రేవంత్ ఉద్ఘాటన



**కొల్హాపూర్, జులై 18 (ప్రభాత ఉదయం)**

పదేళ్లపాటు తానే అధికారంలో ఉంటానని, పాలమూరుప్రాజెక్టులను పూర్తి చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేయడంలో తన నిబద్ధతను ప్రకటించారు. ఈ ప్రాజెక్టుతోపాటు- దిండి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను రద్దు చేసుకోవాలని, అందుకు సహకరించాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. సహకారం లేకపోతే పోరాటం తప్పదని సీఎం హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం నా బాధ్యత అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంతేకాదు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నీ గుండె, నీ కొడుకు గుండె మీద కూడా రాసుకోవాలని.. మరో పదేళ్లు నేనే సీఎంగా ఉంటానని రేవంత్ పేర్కొన్నారు. ఈ పాలమూరు బిడ్డే తెలంగాణను ప్రజా ప్రభుత్వంతో నడిపిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి నేర్చుకోవాలని ఆయన సవాల్ విసిరారు. నీకు దుఃఖ మొస్తే ఏడ్చినా, బావిలో దూకినా, నీ ఇష్టం. కానీ తెలంగాణ ప్రజల కోసం మేము చేసే మంచి పనులను చూస్తూ ఉండాలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పాలమూరు ప్రాంతం సస్యశ్యామలంగా మారి,

..మిగతా 2లో



## హైదరాబాద్‌లో
# భారీ వర్షం
### లోతట్టు ప్రాంతాలు జలమయం

**హైదరాబాద్, జులై 18 (ప్రభాత ఉదయం)**

నగరంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నగరం మొత్తం మేఘావృత్తం అయింది. కాసేపటికే భారీ వాన కురిసింది. దీంతో ప్రధాన రహదారులన్ని జలమయం అయ్యాయి. ఫలితంగా రోడ్లపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. ఉప్పల్‌లో రోడ్డుపైకి భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉప్పల్ స్టేడియం నుంచి హబ్సిగూడ వరకూ ట్రాఫిక్ నిలిచిపోయింది. యూసుఫ్‌గూడ, కృష్ణానగర్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల మ్యాన్‌హోల్స్ తెరుచుకున్నాయి. కాగా, జిహెచ్ఎంసి పరిధిలో రాత్రి వరకూ

..మిగతా 2లో

# లోకేశ్ నీలాగా చదువు లేని వాడు కాదు

నాపై చేసే ఆరోపణలకు ఆధారాలు బయటపెట్టాలి
రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్
లోకేశ్ పక్క రాష్ట్ర మంత్రి.. తమ్ముడి లాంటి వారన్న కేటీఆర్
రేవంత్ రెడ్డి వ్యాఖ్యల వల్ల యూట్యూబర్లకు మినహా ఎవరికీ లాభం లేదని ఎద్దేవా

**హైదరాబాద్, జులై 18 (ప్రభాత ఉదయం)**

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తనకు మంచి మిత్రుడు అని, ఆయనతో మంచి సంబంధాలు ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తాను లోకేశ్‌ను కలిశానని చెబుతున్నారని, కానీ అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు. ఒకవేళ కలిసినా తప్పేమిటని ప్రశ్నించారు. లోకేశ్ పక్క రాష్ట్ర మంత్రి అని, తమ్ముడి లాంటి వాడని అన్నారు. ఏపీ మంత్రి లోకేశ్ ను కేటీఆర్ రహస్యంగా కలిశాడంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా

..మిగతా 2లో



## సమస్య పరిష్కారానికి
# కేంద్రం కట్టుబడి ఉంది

ఫోన్ ట్యాపింగ్‌తో జల్సాలు చేసిన కేసీఆర్
జలవివాదాలపై విషం చిమ్ముతున్న బీఆర్ఎస్
విరుచుకుపడ్డ కేంద్రమంత్రి బండి



**జనగామ, జులై 18 (ప్రభాత ఉదయం)**

జలవివాదాలు పరిష్కరించాలని కేంద్రం చొరవ తీసుకుంటే బిఆర్ఎస్ విషం చిమ్ముతోందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జలవివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏపీ, తెలంగాణ జల వివాదం పరిష్కంచాలని ప్రయత్నిస్తే తప్పుపడుతున్నారని మండిపడ్డారు. నీటి విషయంలో రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడతామని స్పష్టం చేశారు. ఈ సమస్యను జల వివాదం కమిటీ-పరిష్కరిస్తుందని చెప్పుకొచ్చారు. నీటికి సంబంధించి తెలంగాణకు అన్యాయం జరగనివ్వమని వెల్లడించారు. బీఆర్ఎస్ వాళ్లు మళ్లీ తెలంగాణ వాదాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అప్పుడు కిషన్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేశారని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్టు- అనుమానం వస్తోందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌తో కేసీఆర్ జల్సాలు చేశారని విరుచుకుపడ్డారు బండి సంజయ్. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఏ గ్రామానికైనా వస్తాం చర్చిద్దామా అంటూ బండి సవాల్ విసిరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. రెండు పార్టీల నేతలు తిట్టు-కోవడమే పనిగా పెట్టు-కున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలను ప్రజలు నిలదీస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీ-సీలే తమ

..మిగతా 2లో



## బీసీ సీఎంను చేసే
# దమ్ముందా?

అలా చేస్తే.. నేనూ రాజీనామా చేస్తా
సీఎం రేవంత్‌కు
బీజేపీ అధ్యక్షుడు
రామచందర్ రావు సవాల్

**మెదక్, జులై 18 (ప్రభాత ఉదయం)**

బీజేపీ బీసీల పార్టీ అని, ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా బీసీ వర్గానికి చెందినవారని రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే సీఎం రేవంత్ బీసీని ముఖ్యమంత్రిగా నియమించాలి, అలా చేస్తే తాను కూడా పదవికి రాజీనామా చేస్తానని రామచందర్ రావు సవాల్

..మిగతా 2లో

## జూరాలకు
# మళ్లీ పెరిగిన వరద



**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18 (ప్రభాత ఉదయం)**

జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి మళ్లీ పెరిగింది. కర్ణాటక, మహారాష్ట్రతోపాటు వరదతో పాటు భీమా నది నుండి వస్తున్న వరదతో కృష్ణమ్మ పోటెత్తుతున్నది. జూరాలకు నీటి ప్రవాహం తగ్గడంతో అయిదు రోజుల క్రితం గేట్లు మూసివేయగా.. గురువారం రాత్రి నుంచి జూరాలకు వరద ప్రవాహం పెరిగింది. దీంతో శుక్రవారం ఉదయం జూరాల అధికారులు 12 గేట్లు తెరిచారు. మధ్యాహ్నం నుంచి వరద ప్రవాహం పెరగడంతో మరో 6 గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. అదే విధంగా కర్ణాటక జలాశయాలు ఇప్పటికే పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యానికి చేరుకోగ ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టుకు 1,15,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో అధికారులు ప్రాజెక్టు 18 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.51 మీటర్లు. ప్రస్తుతం 317.670 మీటర్ల వద్ద నీరు ఉన్నది. జలాశయంలో గరిష్టంగా 9.65 టీఎంసీలకు గాను 7.971 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. అదేవిధంగా 5 యూనిట్లలో విద్యుదుత్పత్తి కోసం 30,498 క్యూసెక్కులు వదులుతుండగా..మొత్తంగా జూరాల నుంచి 1,06,213 క్యూసెక్కుల ఔట్ ఫ్లో గా నమోదైంది.

# కేసీఆర్ శాపగ్రస్తుడు

మొదటి పేజీ తరువాయి...

రైతుల జీవనోపాధికి బలమైన ఆధారంగా నిలుస్తాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని జటప్రోలులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా, పాలమూరు ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపిరి లభించింది. ఈ సందర్భంగా రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ స్కూల్ విద్యార్థులకు ఆధునిక విద్య, సౌకర్యాలతో ఉజ్వల భవిష్యత్తును అందించనుంది. ఈ సందర్భంగా కొల్లాపూర్ అభివృద్ధికి అవసరమైన నిధులను పూర్తిగా అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. పాలమూరు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్‌లోగా భూసేకరణ పూర్తి చేసి, కృష్ణా జలాలను పొలాలకు తీసుకొస్తామని అన్నారు. మా పొలాల్లో కృష్ణా నీళ్లు పారుతుంటే, కొందరు దీనిని ఓర్చుకోలేకపోతున్నారు. కేసీఆర్ లాంటి వాళ్లు విషం చిమ్ముతున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు. పాలమూరు పచ్చగా మారితే, రైతులు సంతోషంగా ఉంటారని, అది కొందరికి కడుపుమంటగా ఉందని రేవంత్ అన్నారు. పాలమూరు పచ్చగా మారాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ లక్ష్యం కోసం కృషి చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. పాలమూరు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. రైతులకు రుణమాఫీ, మహిళలకు సాధికారత, ప్రాజెక్టుల పూర్తితో పాలమూరు కొత్త ఒరవడిని సాధిస్తుందని రేవంత్ హామీ ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినట్లు- సీఎం రేవంత్ తెలిపారు. 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేశామని, వరి పండించిన రైతులకు బోనస్ కూడా ఇస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని కొందరు అన్నారు. కానీ, మేం 24 గంటలు ఉచిత కరెంటు- ఇస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, వెయ్యి బస్సులకు మహిళలను యజమానులుగా చేశామని అన్నారు. రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ బంక్‌లకు యజమానులుగా, సోలార్ విద్యుత్ కాంట్రాక్టులు ఇచ్చి మహిళలను సాధికారత వైపు నడిపిస్తున్నామని వివరించారు. కేసీఆర్ తన బిడ్డకు బంజారాహిల్స్‌లో బంగ్లా కట్టించారు. కానీ మా ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. కేసీఆర్ హయాంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ హామీలు నెరవేరలేదని రేవంత్ విమర్శించారు. వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేసీఆర్ చెప్పి, ఎందుకు చేయలేదన్నారు. దళిత బిడ్డలు చదువుకుంటే, రాజ్యాలు ఏలితే కొందరికి దుఃఖం వస్తోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ కులాల వర్గీకరణ చేసి న్యాయం చేసిందని రేవంత్ తెలిపారు. 2035 నాటికి తెలంగాణను ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంతో పనిచేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు.



# సమస్య పరిష్కారానికి కేంద్రం కట్టుబడి ఉంది

మొదటి పేజీ తరువాయి...

ప్రచార కర్తలని తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని.. గ్రామీణ వ్యవస్థ సర్వనాశనం అవుతోందని అన్నారు. తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడిన-ల్ల÷టెందంటూ వ్యాఖ్యలు చేశారు కేంద్రమంత్రి. తెలంగాణకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి రేపు (శనివారం) వస్తున్నారని, వ్యాగన్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తారని తెలిపారు. అన్ని స్కామ్‌లు పక్కకు పోయాయని.. ఏ ఒక్క స్కామ్‌లోనూ కేసీఆర్ కుటు-ంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. రెండు పార్టీలు ఒక్కటే అని.. 'నువ్వు కొట్టినట్టు- చెయ్ నేను ఏడ్చినట్టు- చేస్తా' అనే ధోరణిలో ఉన్నారంటూ కేంద్రమంత్రి బండి వ్యాఖ్యలు చేశారు. మరోవైపు బీసీలకు రేవంత్ సర్కార్ అన్యాయం చేస్తోందని ఆరోపించారు. 42 శాతంలో 10 శాతం ముస్లింలే ఉన్నారని.. ఇప్పటికే ఉన్న 23 శాతంలో అదనంగా ఇచ్చేది ఐదు శాతమే అని అన్నారు. బీసీలకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ప్రజాప్రతినిధులు కావాల్సిన బీసీల స్థానాల్లో ఎంఐఎం వాళ్లు అయ్యారన్నారు. ఇప్పుడు జనాభా దామాషా ప్రకారం బీసీలకు మాత్రమే 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని.. దాంట్లో ముస్లింలను కలపొద్దని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# బిసి సిఎంను చేసే దమ్ముందా?

మొదటి పేజీ తరువాయి...

విసిరారు. కేంద్ర క్యాబినెట్‌లో 20 మంది బీసీలు ఉన్నారని గుర్తు చేశారు. బీసీల రిజర్వేషన్లకు 42 శాతం మద్దతు ఇస్తామని, ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొస్తే బీజేపీ సహకరిస్తుందని స్పష్టం చేశారు. బీసీల బిల్లులో 10 మంది ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తే బీసీలకు నష్టం జరుగుతుందని హెచ్చరించారు. మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా నర్సాపూర్‌లో జరిగిన కార్యక్రమంలోమాట్లాడారు. అంతకుముందు ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామచంద్రరావు వెంట ఎంపి రఘునందనరావు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రామచంద్రరావు మాట్లాడుతూ.. మతప్రాధాన్యత రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని తెలిపారు. దేశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుందని, బీజేపీ అవినీతి రహిత పాలన సాగిస్తోందని రామచందర్ రావు అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీజేపీకి పునర్వైభవం తీసుకురావాలని రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. బీజేపీ కేవలం పట్టణాల్లోనే కాదు, గ్రామాల్లో కూడా బలంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఇప్పటివరకు 12 లక్షల కోట్ల రూపాయలు ఇచ్చిందని, బీజేపీ ఒక్క పైసా ఇవ్వలేదన్న ఆరోపణలు కావాలని చేస్తున్నారని రామచందర్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 మోసపు హామీలతో అధికారంలోకి వచ్చి, ఆరు గ్యారెంటీ-లను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని రామచందర్ రావు ఆరోపించారు. గత ప్రభుత్వం లో ఉమ్మడి మెదక్ జిల్లాకు ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి ఉన్నా అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. ఇంతకుముందు ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పటికీ, మెదక్ జిల్లాకు అన్యాయం జరిగిందని అన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, కొత్త రైల్వే స్టేషన్లు, కొత్త జాతీయ రహదారులు బీజేపీ వల్లే వచ్చాయని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ తప్పనిసరిగా వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపి రఘునందన్ రావు మాట్లాడుతూ బిజెపికి ఆదరణ పెరిగిందని, మోడీ పాలనపట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని అన్నారు. జిల్లాల్లోనూ బిజెపి పట్ల ప్రజలు మొగ్గు చూపుతున్నారని అన్నారు.



# సర్కారులో సగం సగమే.. అరకొరగా వైద్యులు.. అందుబాటులో ఉండని మందులు

## పది గంటలు దాటినా పత్తాలేని సిబ్బంది

## సమయం కాకుండానే వెళ్లిపోతున్న వైద్యులు

## డాక్టర్ల కోసం రోగులపడిగాపులు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18 (ప్రభాత ఉదయం)నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అన్న పాటను తలపిస్తున్నది గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి. అక్కడ వైద్యులు ఉంటే మందులు ఉండవు. మందులుంటే వైద్యులు ఉండరు. అన్ని టెస్టులు అందుబాటులో ఉండవు. సదుపాయాలూ అరకొరగానే ఉన్నాయి. దాంతో జనం టెస్టుల కోసం, మందుల కోసం ప్రైవేట్‌కు వెళ్లాల్సి వస్తోంది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పేరుకే పెద్దా ఆసుపత్రి కాని...ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో అందని వైద్యం

వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పనితీరు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్టుగా ఉంది. ఈ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేక వైద్యమందక రోగులు అవస్థలు పడుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో పనిచేసే వైద్యుల్లో మెజారిటీ వైద్యులు ప్రైవేట్‌గా వైద్యం చేస్తుంటారు. కొంతమందికి సొంత ఆస్పత్రులు ఉండగా.. మరికొంత మంది ఇతర ఆస్పత్రుల్లో పనిచేస్తూ ప్రభుత్వ వైద్యాన్ని విస్మరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైద్యులకు సీనియారిటీ పెరిగిన కొద్దీ విధులకు డుమ్మా కొట్టడం ఎక్కువవుతుందనే ప్రచారం జరుగుతోంది. ప్రైవేట్‌లో పని లేకుంటేనే ప్రభుత్వాస్పత్రికి వస్తుంటారని సిబ్బందే అంటున్నారు.

### డాక్టర్లు ఉండరు మందులు దొరకవు

గద్వాల మండలానికి చెందిన ఓ మైనర్ బాలిక ప్రమాదవశాత్తు కాళ్లు సైకిల్ టైర్ లో పడటంతో వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. ఓపీ రాయించుకుని పిల్లల వైద్య నిపుణులు సూచన మేరకు ఎక్స్ రే స్కానింగ్ కోసం రాసారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఎక్స్ రే చూయించుకుని ఆర్థోపెడిక్ ఫిజీషియన్ వైద్యుల గదికి వెళ్లారు. అక్కడి వైద్యులకు ల్యాబ్ నుంచి సమయానికి అందలేదు. ఎక్స్ రే రిపోర్టులు ఆలస్యం కావడంతో అప్పటికే సమయం అయిపోయిందని డాక్టర్లు వెళ్లిపోయారు. అప్పుడు సమయం ఒంటిగంట అవడంతో వైద్యులు గంట ముందే వెళ్లిపోయారంటూ రోగుల తల్లిదండ్రులు ఆరోపించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ ఎంఎల్ టి స్టూడెంట్ కు ప్రమాదవశాత్తు ఆక్సీజన్ సిలిండర్ కాలు మీద పడటంతో ఎక్స్ రే రిపోర్టు తీసి రిపోర్టులు వచ్చే లోపల వైద్యులు లేకపోవడంతో చేసేదేమి లేక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చింది. ఇలా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని విభాగాల సీనియర్ వైద్యులు ఓపీల్లో కూర్చోకుండానే కాలం వెల్లదీస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# లోకేశ్ నీలాగా చదువు లేని వాడు కాదు

మొదటి పేజీ తరువాయి...

స్పందించారు.

"నేనేదో లోకేశ్‌ను అర్ధరాత్రి కలిశానట. నేను ఏం చేసినా బాజాప్తా చేస్తాను. అయినా లోకేశ్ నీలాగ ఏమైనా అంతర్రాష్ట్ర దొంగనా? లోకేశ్ ఏమైనా నీలాగా సంచులు మోసిన వ్యక్తా? లోకేశ్ నీలా చదువు రాని వాడు కాదు కదా" అంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "లోకేశ్ మీ పెద్ద బాస్ చంద్రబాబు కొడుకే కదా.. నేనేదో గూండానో, దావూద్ ఇబ్రహీంనో చీకట్లో కలిసినట్లు డైలాగ్‌లు ఏందిరా హౌలా?" అంటూ దుయ్యబట్టారు.నేను దొంగనేమీ కలవలేదని, అయినా నీలా ఢిల్లీలో లోఫర్ రాజకీయాలు చేయడం లేదని విమర్శించారు. చీకట్లో వెళ్లి అమిత్ షా కాళ్లు పట్టుకుంటున్నానా, మోదీకి ప్రణమిల్లుతున్నానా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా పాలన గురించి తెలుసుకోవాలంటే బీఆర్ఎస్‌ను, దోపిడీ గురించి తెలుసుకోవాలంటే మాత్రం మీ వద్దకు రావాలని ఎద్దేవా చేశారు.

ఖమ్మంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ, తనపై టన్నుల కొద్దీ కేసులు పెట్టారని, చివరకి గుండు సూదంత ఆధారం కూడా చూపలేకపోయారని విమర్శించారు. దుబాయ్‌లో ఎవరో చనిపోతే తనకు సంబంధం అంటగట్టడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారికి ధైర్యం ఉంటే, ఆ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

# ప్రేమ పేరుతో మోసగించిన యువకుడిపై కేసు నమోదు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18(ప్రభాత ఉదయం)ప్రేమ పేరుతో ఓ యువతిని మోసగించిన యువకుడిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గట్టు పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైనట్లు గట్టు ఎస్ఐ కేటి మల్లేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన రఘునాథ్ గౌడ్ హైదరాబాద్ లో కాంపిటీషన్ ఉద్యోగ పరీక్షలకు కోచింగ్ కు తీసుకుంటున్న సమయంలో ఖమ్మం జిల్లా పాల్వంచకు చెందిన ప్రియాంక అనే యువతితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది, తనను పెళ్లి చేసుకుంటానని చెప్పిన యువకుడు తీరా ఉద్యోగం వచ్చిన తర్వాత పెళ్లి విషయం వాయిదా వేసుకుంటూ వచ్చాడు. దీంతో ఆ యువతి ఈనెల 14న చిన్నోనిపల్లి గ్రామానికి చేరుకుని ఆ యువకుడితో పెళ్లి విషయం మాట్లాడగా.. అతని కుటుం బ సభ్యులు యువతితో వివాహానికి నిరాక రించినట్లు తెలిసింది. తిరిగి హైదరబాద్ కు వెళ్లిన ఆ యువతి ఈనెల 16న చిన్నోన్నిపల్లి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను నిలదీయగా కొంత వాగ్వివాదం చోటు చేసుకోగా యువకుడి సమీప బంధువు యువతి పై దాడి చేయడంతో మనస్తాపానికి గురైన ఆ యువతి ప్రేమించిన యువకుడి ఇంటి దగ్గరే నిద్ర మాత్రలు వేసుకుని అపస్మారక స్థితికి చేరు కుంది. గమనించిన స్థానికులు ఆమెను హుటాహుటిన గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అన్నిరకలా వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించడంతో ఆమె కోలుకుంది. గురువారం గట్టు పోలీసులు గద్వాల ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న ఆ యువతితో మాట్లాడి వివరాలను సేకరించారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేటి మల్లేష్ తెలిపారు. ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన రఘునాథ్ గౌడ్ పై చీటింగ్ కేసు యువతి పై దాడికి పాల్పడినందుకు వీరేష్ పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

మొదటి పేజీ తరువాయి...

భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. భాగ్యనగర వాసులంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, మెహదీపట్నం, మణికొండ, టోలిచౌకి, షేక్‌పేట్, గోల్కొండ, అత్తాపూర్, లంగర్‌హౌస్, బంజారాహిల్స్, తార్నాక, ఓయూ, నాచారం, మల్లాపూర్, హబ్సిగూడ, కూకట్‌పల్లి, కేపీహెచ్బీ, నిజాంపేట్, మియాపూర్, మూసాపేట్ సహా బాలానగర్, సనత్‌నగర్, ఎర్రగడ్డలో భారీ వర్షం కురుస్తోంది. అలాగే మాదాపూర్, హై-టె-క్ సిటీ-, కొండాపూర్, శేరిలింగంపల్లి, హకీంపేట్, కంటోన్మెంట్, ఖైరతాబాద్‌లోనూ భారీగా వర్షం పడుతోంది. ఆయా ప్రాంతాల్లో జనం అవస్థలు పడుతున్నారు. మరోవైపు వాహనదారులు తీవ్ర ఇక్కట్లు- పడుతున్నారు. లోతట్టు- ప్రాంతాల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోగా.. పలువురు మెట్రో పిల్లర్ల కింద తలదాచుకున్నారు. కాగా, వర్షం నేపథ్యంలో అధికారులను జీహెచ్ఎంసీ అప్రమత్తం చేసింది. వర్షం తగ్గేంత వరకూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు సూచనలు చేసింది. ఇలా ఉండగా, తెలంగాణలో రెండు రోజులపాటు- భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం వరకూ తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో వానలు కురవనున్నట్లు- వెల్లడించింది. హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, నాగర్ కర్నూల్, పెద్దపల్లి, రంగారెడ్డి వరంగల్, హనుమకొండ జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. ఆయా జిల్లాల్లో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# రాజేంద్రనగర్ శ్రీ మాత పోచమ్మ అమ్మవారికి సారే సమర్పణ



**బుద్వేల్, జూలై 18(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ శ్రీ మాతా పోచమ్మ అమ్మవారి కి శుక్రవారం సాయంత్రం భక్తులు సారే సమర్పించారు. వివిధ రకాల పండ్లు , మిఠాయిలు, ఆహార వస్తువులను అమ్మవారికి నైవేద్యంగా ఉంచారు. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.**

రాజేంద్రనగర్ శ్రీ మాత పోచమ్మ అమ్మవారికి సారే సమర్పిస్తున్న మహిళా భక్తులు



అమ్మ వారిని దర్శించుకున్న భక్తులు

## నేడు కాటేదాన్, శివరాంపల్లి, హిమాయత్ సాగర్‌లలో

# విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్/హిమాయత్ సాగర్, జూలై 18(ప్రభాత ఉదయం) కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. దుర్గా నగర్ విద్యుత్ లీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు దుర్గా నగర్, దుర్గా హిల్స్, టి ఎన్జీవోస్ కాలనీ, అయ్యప్ప స్వామి టెంపుల్, మైలార్దేవ్పల్లి కల్లు కాంపౌండ్, శాంతినగర్, గణేష్ నగర్, సప్న టాకీస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాణా అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.



**హిమాయత్ సాగర్‌లిలో..**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ల అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు. భాగ్యనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీ హిల్స్, భాగ్యనగర్ కాలనీ, రాధానగర్, కేకే త్రీ, రాధా నగర్, ఫేస్ 3, హీరకాలని, వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ ప్రశస్తునగర్, రాధా రియాలిటీ, ప్రశాంత్ నగర్, తిరుమల గార్డెన్, రాధా రియాలిటీ, వివేకానంద నగర్, బచ్చన్ స్కూల్, పద్మశ్రీ హిల్స్ ప్రధాన రహదారి, గంధం గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గంధం గూడ, వెస్ట్ ఎండ్ కాలనీ, శాంతినగర్, లక్ష్మీ నగర్, హైదర్ షాకోట్, మధ్యాహ్నం రెండు గంటల నుండి 2:30 వరకు శ్రీరాంనగర్ విద్యుత్ పీటర్ పరిధిలో గల ప్రాంతాలైన సాయి రామ్ నగర్, సాయి హర్ష కాలనీ, సాయిరాం ఎంక్లేవ్, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం నాలుగున్నర వరకు ఇండస్ వ్యాలీ, సంజయ్ గాంధీనగర్, భవాని కాలనీ భవాని కాలనీ, బైరాగి గూడ, శివ సాయి కాలనీ, సుబ్రహ్మణ్య కాలనీ, రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి, గంధం గూడ, వాంటేజ్ విద్యుత్ పీటర్ పరిధిలో వాంటెజ్ కాంప్లెక్స్, అడ్జసెంట్ విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఎంత రాయానికి సహకరించాలని ఆయా సెక్షన్ల ఇంజనీర్లు కోరారు

**శివరాంపల్లిలో...**

శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు వివిధ మరమ్మతుల నిమిత్తం వేస్తున్నట్లు శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు. విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన అసన్నగర్ శివరాంపల్లి ఎన్టీఆర్ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన బాబా నగర్, హసన్ నగర్, ఎన్టీఆర్ నగర్, పహాడి, అక్బర్ హిల్స్, 10:30 నుండి 11 గంటల వరకు పాడి విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన సులేమాన్ నగర్ చింతల్ మెట్, మధ్యాహ్నం రెండున్నర నుండి మూడు గంటల వరకు శ్రీదేవి కాలనీ విద్యుత్ లీడర్ పరిధిలో శ్రీదేవి కాలనీ, వికర్ సెక్షన్ కాలనీ, యూనివర్సిటీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

## అత్తాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో

# 6వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

### స్వాగతించిన ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీలత

**బుద్వేల్, జూలై 18(ప్రభాత ఉదయం) :**

అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వెరిజాన్ డాటా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైటెక్ సిటీ మైండ్ స్పేస్ వారి సహకారంతో సీఆర్ఎస్ ఫండ్ తో సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ ల్యాబ్ లో ఆరవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యయురాలు శ్రీలత అధ్యక్షత వహించి వేరిజాన్ డాటా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారాన్ని స్వాగతించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీలత మాట్లాడుతూ...భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని,విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే పరికరాలను అందించాలని కోరారు. అనంతరం ఆరో తరగతి విద్యార్థులకు ఒక స్కూల్ బ్యాగ్ తో పాటు వారికి సరిపోయిన స్టేషనరీ మొత్తాన్ని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెరిజాన్ సర్వీసెస్ ప్రతినిధులు పంకజ్ సింగ్,వెంకటరఘురామ్,సంతోష్,విశ్వనాథ్,సందీప్,డానిష్ లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు సాయిప్రసాద్ రావు,రోజా రాణి,శ్రీనివాస సాగర్,సురేష్,హాసిని తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయానికి ముంబాయి లో జరిగిన ఓపెన్ సోర్స్ జీఐఎస్ దినోత్సవ వేడుకలలో ఉత్తమ విశ్వవిద్యాలయం ఆవార్డు రావడం సంతోషకరమని, ఉద్యాన విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోతురాజు యాదయ్య అన్నారు. అసోసియేషన్ తరపున శుక్రవారం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి ని కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు టి.కుమార్. ఆర్ దీపారాణి, సీహెచ్ అనిల్, శ్రీహర్త, హరిక్రిష్ణ, భవిత. అలేఖ్య, పేరెడ్డి, కె. హరిత తదితరులు

**- బుద్వేల్, ప్రభాత ఉదయం**



జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అప్పారెడ్డిగూడెం మాధవి



మాధవి తో బత్తుల శాలిని డేవిడ్ రాజు, షారోన్ జ్యోతి

## ఘనంగా అప్పారెడ్డిగూడెం మాధవి

# జన్మదిన వేడుకలు

బుద్వేల్, జూలై 18(ప్రభాత ఉదయం):రాజేంద్రనగర్ డివిజన్ వార్డు కమిటీ మాజీ సభ్యురాలు, స్నేహ పొదుపు సంఘం మాజీ అధ్యక్షురాలు అప్పారెడ్డిగూడెం మాధవి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జన్మదినం సందర్భంగా మాధవి కుటుంబ సభ్యుల తో కలిసి మెదక్ చర్చ్ కు వెళ్లారు. సాయంత్రం ఇంటి వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అప్పారెడ్డిగూడెం మాధవి ని కుటుంబ సభ్యులు అప్పారెడ్డిగూడెం భీమయ్య, శశాంక్, స్నేహ, బంధువులు బత్తుల శాలిని డేవిడ్ రాజు, షారోన్ జ్యోతి లు అభినందించారు.

**ఫోన్ లో శుభాకాంక్షలు తెలిపిన బందువులు, స్నేహితులు, చర్చ్ సభ్యులు :**

మాధవి జన్మ దిన వేడుకల సందర్భంగా బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు ఫోన్ లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



జన్మదినం సందర్భంగా మెదక్ చర్చ్ వద్ద అప్పారెడ్డి గూడెం మాధవి



## ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య

బుద్వేల్, జూలై 18 ( ప్రభాత ఉదయం) ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఎవరు లేని సమయంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మైలార్దేవుపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి. టీఎన్జీవోస్ కాలనీకి చెందిన ఆనందరెడ్డి (41) డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్ కు చీర తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న మైలాందేవుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆనంద్ రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను

# ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

### అభివృద్ధి పనుల పరిశీలనలో నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, జూలై 18(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందని నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని మోహన్ రెడ్డినగర్ లో స్థానికుల విజ్ఞప్తి మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జీహెచ్ఎంసీ,జలమండలి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. సీసీ రోడ్డు పనులకు నూతన ఎస్టిమేషన్,లు వేసి వీలైనంత త్వరగా పనులను ప్రారంభించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ పైప్లైన్ వ్యవస్థ దెబ్బ తినడంతో నూతన పైప్ లైన్ కొరకు చర్యలు చేపట్టాలని,రానున్న బోనాల పండుగను దృష్టిలో ఉంచుకుని అమ్మవారి దేవాలయం పరిసర ప్రాంతాలలో ప్యాచ్ వర్క్ పనులు మరమత్తు పనులు విద్యుత్ దీపాలు తదితర అన్ని పనులను త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పండగ వేల ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...స్థానికంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డా సహించేది లేదన్నారు. మెరుగైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ రానున్న రోజుల్లో మరెన్నో అభివృద్ధి పనులు చేపట్టి మోడల్ డివిజన్ గా తీర్చిదిద్దుతామన్నారు. భవిష్యత్‌లో జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్,జలమండలి సూపర్ వైజర్ లోక్ నాథ్,రామ్ కీ సిబ్బంది నరసింహ, సంతుగౌడ్, కురుమూర్తి, రోహిత్, అశోక్,రాహుల్,నాని,బబ్లూ,ఎన్ను శంకర్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,సంతోష్,రాజు,నటరాజ్,లక్ష్మణ్,విష్ణు,బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ లో పోచమ్మ దేవాలయం వద్ద ఏర్పాట్లను చేసిన కాలనీ సం క్షేమ సంఘం అధ్యక్షుడు అడికె రాజు, స్థానిక నాయకులు నర్సింగ్, బౌన్సింగ్, రాధాక్రిష్ణ, బాబురావు, వీరేష్, దుర్గేశ్, యాదయ్య, ఓంప్రకాశ్ తదితరులు

**- బుద్వేల్, ప్రభాత ఉదయం**

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో చెరువులుగా మారిన రోడ్లు



శివరాం పల్లి నుంచి ఆరాంఘర్ వెళ్ళే మార్గంలో రోడ్డుపై వరద నీరు



దుర్గానగర్ లో వరద నీరు వెళ్లేలా చేస్తున్న డీ ఆర్ ఎఫ్ సిబ్బంది




ఆరాంఘర్ లో ఆగిపోయిన ఆర్ టీ సీ బస్సును క్రేన్ తో లాగిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు

బుద్వేల్, జూలై18(ప్రభాత ఉదయం) : శుక్రవారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షానికి రాజేం ద్రనగర్ సర్కిల్ రహదారులు చెరువులను తలపించాయి. ఏ రోడ్డు చూసిన వరద నీటితో నిండి పోయి వాహనదారులకు ఇబ్బందులు కలిగించాయి. ప్రధాన రహదారులు చెరువులుగా మారడం తో వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ వైపు వెళ్లే మార్గంతో పాటు మైలార్ దేవుపల్లి నుంచి కాటేదాన్ వైపు వెళ్లే మార్గంలో గల దుర్గానగర్ చౌరస్తా చిన్న పాటి చెరువులా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలిగించింది. ఉప్పర్పల్లి 191 పిల్లర వద్ద ఎక్కువ ఇబ్బంది లేకపోయినా, వరద నీరు నిలచి ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. డీఆర్ఎఫ్ సిబ్బంది వర్షంలో నీటి కాలువలలోకి వరద నీరు వెళ్లడానికి పనులు చేశారు. కింగ్స్ కాలనీ రోడ్లన్ని రహదారులను తలపించాయి. ఇక్కడ డీఆర్ఎఫ్ సిబ్బంది తో పాటు సానికులు ముందుకు వచ్చి వరద నీరు కాలువలలోకి వెళ్లేలా పనులు చేశారు.


**ఆగిన ఆర్టీసీ బస్సు :**

శుక్రవారం కురిసిన వర్షానికి శివరాంపల్లి వద్ద నూతనంగా నిర్మించిన ఫ్లై ఓవర్ క్రింద వరద నీరు నిలవడంతో ఆర్టీసీ బస్సు ఆ నీటి లో ఆగిపోయింది. దీంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీహెచ్ రాజు ప్రత్యేక చొరవ తీసుకుని క్రేన్ సహాయంతో ట్రాఫిక్ పోలీసులతో కలసి ఆ ఆర్టీసీ బస్సును నీటి లోనుంచి లాగి పక్కకు తీయడంతో ట్రాఫిక్ సమస్యలు తప్పాయి.





చెరువుగా మారిన దుర్గా నగర్ రోడ్డు



కింగ్స్ కాలనీ లో చెరువులను తలపించిన రోడ్లు

# ఇంటికో ఇంకుడు గుంత

### భూగర్భ జలాల పెంపునకు జలమండలి యాక్షన్ ప్లాన్..!

### ముఖ్యమంత్రి ఆదేశంతో.. 90 రోజుల ప్రత్యేక కార్యక్రమం

### 16 వేల ఇంకుడు గుంతల నిర్మాణానికి సిద్ధం కావాలి..

### అధికారులు, ఎన్జీఓలతో జలమండలి ఎండీ జూమ్ మీటింగ్




ఖైరతాబాద్, జూలై 18(ప్రభాత ఉదయం) ఇంకుడు గుంతల ప్రాధాన్యం, వాటి నిర్మాణ ఆవశ్యకత ప్రజలకు తెలపడానికి.. జలమండలి 90 రోజుల యాక్షన్ ప్లాన్ ను రూపొందిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశంతో ఓఆర్ ఆర్ వరకు భూగర్భ జలాలను పెంచే లక్ష్యంగా.. ఇంటికో ఇంకుడు గుంత కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ కలిసి జలమండలి అధికారులు, ఎన్జీఓలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. ఓఆర్ ఆర్ పరిధిలో భూగర్భ జలాలను పెంచే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశంతో జలమండలి 90 రోజుల యాక్షన్ ప్లాన్ ను రూపొందించిందని, ఈ యాక్షన్ ప్లాన్ లో భాగంగా రానున్న 90 రోజుల్లో 16 వేల ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. అలాగే, జలమండలి అధికారులు, ఎన్జీఓలు క్షేత్రస్థాయిలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టే అనువైన ప్రాంతాలను వారంలోగా గుర్తించాలని ఆదేశించారు. అలాగే, అపార్టుమెంట్ లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ వాసులకు ఇంకుడు గుంతల ప్రాధాన్యతను తెలిపేలాగా కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను సూచించారు. వీటితోపాటు నిరుపయోగంగా ఉన్న బోర్ వెల్ లను గుర్తించి ఇంజక్షన్ బోర్ వెల్ గా మార్చడానికి ప్రతిపాదనలను రూపొందిచాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల వేసవి సమయాల్లో భూగర్భ జలాల స్థాయి తగ్గిపోవడంతో.. తాగునీటితోపాటు గృహ అవసరాలకు సైతం అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే పరిస్థితి తలెత్తింది. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశంతో హైదరాబాద్ జిల్లా ఇన్చార్జ్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్ మార్గదర్శకంలో జలమండలి ఇంటికో ఇంకుడు గుంత అనే నినాదంతో ముందస్తు ప్రణాళికతో ప్రత్యేక కార్యచరణకు దిగింది. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ.. ఇంకుడు గుంతల కోసం గుర్తించిన ప్రాంతాలను నిర్మాణం ముందు, నిర్మాణం తరువాత తీసిన ఫోటోలను అప్లోడ్ చేసి, జియో ట్యాగ్ చేసే వీలుగా ప్రత్యేక మొబైల్ యాప్ ను రూపొందించాలని ఐటీ వింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే, ఎప్పటికప్పుడు కార్యక్రమం పురోగతిని తెలుసుకునే విధంగా ప్రత్యేకమైన డ్యాష్ బోర్డును రూపకల్పన చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్ సీ డైరెక్టర్ ఆపరేషన్-2 వీఎల్ ప్రవీణ్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్, డైరెక్టర్ ఆపరేషన్-1 అమరేందర్ రెడ్డి, సీజీఎంలు, ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ, ఎన్జీఓల ప్రతినిధులు పాల్గొన్నారు.



## గద్వాల గ్రంథాలయ

# భవన నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరు చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18 (ప్రభాత ఉదయం) ఏఐసీసీ కార్యదర్శి , అలంపూర్ మాజీ శాసనసభ్యులు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాస్ జిల్లా కేంద్ర గ్రంథాలయం గద్వాల భవన నిర్మాణ పనులను చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని నిధులు లేక గ్రంథాలయ భవన నిర్మాణ పనులు ఆగిపోయి ఉన్నాయి వాటికి బిల్లులను మంజూరు చేసి త్వరగా గ్రంథాలయ భవనం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంతోష్ కి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం గద్వాలలో పాఠకులు చదువుకోడానికి ప్రస్తుతం ఉన్న భవనం సరిపోవడం లేదు గ్రంథాలయ పాఠకుల కు అనుగుణంగా కొత్త భవన నిర్మాణం త్వరగా పూర్తిచేసి పాఠకులకు సౌకర్యంగా ఉండే నూతన గ్రంథాలయ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటారని గ్రంథాలయ చైర్మన్ కలెక్టర్ సంతోష్ తెలిపారు.



## జోరుగా ఇసుక అక్రమ రవాణా.. చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలంలోని ఇర్కిచేడు గ్రామ శివారులో గల వాగు నుంచి కొన్నిరోజులుగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. అక్రమార్కులకు అధికారులు వంతపాడడంతో ఇసుక దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇసుక అక్రమ రవాణాపై జిల్లావ్యాప్తంగా చర్చ జరుగుతున్నా.. తగ్గేదేలే అన్నట్లుగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమార్కులు రెచ్చిపోయి పగలు రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. వాగులోంచి ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని, దీంతో నీటి కొరత ఏర్పడుతుందని రైతులు, గ్రామస్థులు, ఆందోళన వ్యక్తం చేసున్నారు. గ్రామాలల్లో ఇసుక సమస్య తీవ్రంగా ఉండటంతో దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు ఇసుకను తరలిస్తూ అధిక ధరలకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. ఇదంతా అధికారుల అండదండలతోనే కొనసాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

## తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం

# ధరూర్ మండల్ నూతన కార్యవర్గం



గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 18 (ప్రభాత ఉదయం) ధరూర్ మండలంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతమైంది. మండలంలోని పలు పాఠశాలలైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధరూర్, జాంపల్లి, బురెడ్డిపల్లి, మార్లబీడు, ర్యాలంపాడు, రేవులపల్లి, మన్నాపురం తదితర పాఠశాలల్లో ఈ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. సంఘ ప్రధాన కార్యదర్శి ఐ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... 317 బాధితులకు అండగా ఉంటామని అదేవిధంగా వెంటనే ఐదు డిఏలు మంజూరు చేయాలని, పిఆర్సిని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో %ూఖూ% జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ. శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర సభ్యులు వి. నరేష్ తో పాటు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో స్పందించి సంఘం పట్ల తమ మద్దతును తెలిపారు. సభ్యత్వ నమోదులో పాల్గొన్న వారిలో జి. నాగరాజు, జగన్మోహన్ రెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు, చక్రవర్తి, నరేష్, ఎస్. రవి, సుంకన్న, వీరేష్, శ్రీకాంత్, మోహన్ రవి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులలో సంఘటిత స్ఫూర్తిని, ఐక్యతను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు టి పి యు ఎస్ నాయకులు తెలిపారు.







## వరంగల్ నగరంలోని జూ పార్క్ అభివృద్ధికి 4.2 కోట్లు మంజూరు

### మంత్రి కొండ సురేఖ

### కాకతీయ జూలాజికల్ పార్క్‌లో తెల్లపులిని విడుదల చేసిన మంత్రి

### పార్కులో మొక్కలు నాటిన మంత్రి

### వరంగల్లో98 మహిళా సంఘాలకు 12. 46 కోట్ల రుణాల చెక్కులను అందజేసిన మంత్రి

వరంగల్ జులై 18 ,(ప్రభాత ఉదయం బ్యూరో): వరంగల్ నగరం లోని కాకతీయ జూలాజికల్ పార్క్ అభివృద్ధికి 4. 2 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూ పార్కులో సిసి రోడ్లు అందరికి పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు . పార్కులో కొత్త ఆకర్షణలు కనిపిస్తాయని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ జువాలజికల్ పార్క్ నుంచి తీసుకువచ్చిన తెల్లని పులిని హనుమకొండ లోని కాకతీయ జూ పార్క్ లో సందర్శకులకు అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. జంతువులను ప్రతి ఒక్కరు ప్రేమించాలన్నారు. హనుమకొండలోని జూ పార్కును అభివృద్ధి చేసి సందర్శకులకు అందుబాటులో ఉంచే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణలకు తోడ్పడాలని తెలిపారు .జంతువు ప్రేమికులు జంతువులను దత్తత తీసుకోవాలన్నారు అనంతరం వనమహోత్సవం లో భాగంగా పార్క్ లో ఫారెస్ట్ అధికారులతో కలిసి మొక్క నాటారు. పార్క్ లో ఉన్న జంతువులను నగర ప్రజలు సందర్శించాలని కోరారు. అలాగే తూర్పు వరంగల్ నియోజకవర్గంలోని 98 మహిళా స్వయం సహాయక సంఘాలకు 12. 46 కోట్ల లక్షల రుణాల చెక్కులను మంత్రి అందజేశారు . వరంగల్ నగరంలోని శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో చెక్కులను అందజేశారు. మహిళా అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉ ందన్నారు.



## వివేకానంద నగర్ నారాయణ పాఠశాలలో విద్యార్థుల క్యాబినెట్ అవగాహన సమావేశం

### దేశానికి అవసరమైన నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుంచే అమలు చేసుకోవాలి

### ఏ జి ఎం వేణుగోపాల్,ఏ ఎస్ ఐ నన్నేమియా

కూకట్‌పల్లి, జూలై 18 (ప్రభాత ఉదయం): శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో మాధవరం కాలనీలో ఉన్న నారాయణ పాఠశాల ఈ.వి.ఎన్ బ్రాంచ్ లో విద్యార్థుల క్యాబినెట్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ నాయకులను ఎన్నిక చేసుకొని, నాయకత్వ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏజీఎం వేణుగోపాల్, ఏ ఎస్ ఐ నన్నేమియా, హెడ్ కానిస్టేబుల్ హాజరయ్యారు. ఏజీఎం వేణుగోపాల్ మాట్లాడుతూ,"విద్యార్థులంతా మంచి ప్రవర్తనతో, కొత్త ఆలోచనలతో ప్రతి రంగంలో ఎదగాలి. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నైతిక విలువలు కూడా సంతరించుకోవాలి. భవిష్యత్తులో నాయకులుగా ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఏ ఎస్ ఐ ఎండి నన్నేమియా మాట్లాడుతూ"దేశానికి అవసరమైన నాయకత్వ గుణాలు విద్యార్థి దశ నుంచే అభివృద్ధి చెందాలి. ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో, బాధ్యతతో ముందుకు సాగాలి" అని సందేశం ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ కూడా విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్వేతా మెడమ్ మాట్లాడుతూ,"ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలు పెంపొందుతాయి. సమాజంలో వారి పాత్ర గురించి అవగాహన కలుగుతుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ సార్, వైస్ ప్రిన్సిపాల్ కవిత, ఏ.ఓ. రోహిత్ కుమార్, ఉపాధ్యాయులు, ఈ సమావేశంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఉ పాధ్యాయులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608